

ఎఫ్‌ఏ పోయి ఎస్‌ఏ వచ్చే

నేటి నుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు మొదలు కానున్నాయి. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు పెదవి విరుస్తున్నాయి. - 8లో



మందు తాగవద్దు అన్నందుకు

మందు తాగవద్ద అన్నందుకు ఓ వ్యక్తి నదిలో దూకేశాడు. అతని ఆచూకీ ఇంకా తెలియరాలేదు. - 8లో



కేసు దర్యాప్తు వేగవంతం

నకిలీ జీఎస్టీ అధికారుల కేసు దర్యాప్తు వేగవంతమైంది. ఎస్పీ పర్యవేక్షిస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

నేటి నుంచి కొత్తగా రెండు ఇసుక స్టాక్ పాయింట్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో మరో రెండు ఇసుక స్టాక్ పాయింట్లను మంగళవారం నుంచి ఏర్పాటు చేస్తున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం తెలిపారు. గార మండలం శాలిహుండం, బూర్జ మండలం ఖాఖండ్యంలలో కొత్తగా రెండు ఇసుక స్టాక్ పాయింట్లు ప్రారంభిస్తున్నామని, ఈ పాయింట్ల నుంచి ఇసుకను మంగళవారం నుంచి బుక్ చేసుకోవచ్చని ఆయన తెలిపారు. శాలిహుండం స్టాక్ పాయింట్ నుంచి ఇసుక కోసం అక్కడి సచివాలయంలో, ఖా ఖండ్యం స్టాక్ పాయింట్ వద్ద ఇసుక కోసం లంకాం-మామిడివలస గ్రామ సచివాలయంలో బుకింగ్స్ స్లిప్ పొందాలని తెలిపారు. తొలిరోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు స్టాక్ పాయింట్ వద్ద మంజూరు చేస్తారని, ఏదైనా సమస్య ఉంటే వాట్సప్ నెంబర్ 9701691657, టోల్ ఫ్రీ నెంబర్ 1800-425-6012 కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

అక్రమంగా గ్రావెల్ తరలింపు



అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్

సంతబొమ్మాళి: సంతబొమ్మాళి పంచాయతీ లక్ష్మీపురం కొండ నుంచి గ్రావెల్‌ను అక్రమంగా తరలించుకుపోతున్నారు. రెండు రోజులుగా యథేచ్ఛగా టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా గ్రావెల్‌ను తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు. తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ స్పందిస్తూ సిబ్బందిని పంపి నిలుపుదల చేస్తామన్నారు. వీఆర్ఓ రమేష్ మాట్లాడుతూ గ్రావెల్ తరలింపునకు ఎలాంటి అనుమతులు లేవని అన్నారు.

కేఆర్ స్టేడియంలో క్రీడోత్సవాలు నేడు



ఫిట్ ఇండియా ప్రతిజ్ఞలో అధికారులు, క్రీడాకారులు, కోచ్‌లు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ క్రీడోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీకాకుళంలో వివిధ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్టు డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు తెలిపారు. శ్రీకాకుళంలోని కోడిరామ్మూర్తి స్టేడియంలో 100మీటర్ల పరుగు, బ్రిస్క్ వాక్, వాలీబాల్ క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు. అలాగే నగరంలోని శాంతినగర్‌కాలనీలో ఉన్న ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ఈనెల 29న జాతీయ క్రీడల దినోత్సవం రోజున ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల చేతులమీదుగా బహుమతులు అందజేయనున్నట్టు శ్రీధర్‌రావు చెప్పారు. జాతీయ క్రీడోత్సవాల్లో భాగంగా తొలిరోజు సోమవారం ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ జరిగింది. శ్రీకాకుళం కేఆర్ స్టేడియంలో క్రీడాకారులతోపాటు వసతి గృహాల విద్యార్థులు ఈ ప్రతిజ్ఞలో పాల్గొన్నారు.



కఠిన చట్టాలు అమలు చేయాలి

కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన ఘటన చాలా దారుణం. మన దేశంలో చట్టాలు బలహీనంగా ఉండడం వల్లే దాడులు జరుగుతున్నాయి. కఠిన చట్టాలు అమలు చేస్తేనే ఇలాంటి దాడులను నిరోధించడం సాధ్యమవుతుంది.

డాక్టర్ ఎస్.రాజేశ్వరి, ఫిజియోథెరపిస్టు, సీహెచ్‌సీ, ఇచ్ఛాపురం

భద్రత పెంచాలి

కోల్‌కతాలో వైద్యురాలి హత్య ఘటన అనంతరం బయటకు వెళ్లాలంటే భయం వేస్తోంది. వైద్యారోగ్య మహిళా సిబ్బందికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భద్రత కట్టుదిట్టం చేయాలి. రాత్రి వేళల్లో విధులకు హాజరు కావాలంటే ఇబ్బందిగా ఉంది. రోగుల ప్రాణాలు కాపాడే వైద్యులపై దాడి చేసేవారిని కఠినంగా శిక్షించాలి.

– డాక్టర్ హెచ్.సునీత, ఈఎన్‌టీ వైద్యురాలు, సీహెచ్‌సీ ఆస్పత్రి పాతపట్నం





మానసిక ఒత్తిడికి గురవుతున్నారు

ఆస్పత్రుల్లో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి అనుకూల వాతావరణం ఉండాలి. ఇక్కడ పనిచేసే వారు నిత్యం మానసికంగా తీవ్రమైన ఒత్తిళ్లకు గురవుతున్నారు. బయటకు చెప్పుకోలేని పరిస్థితిలో పనిచేస్తున్నారు. అనేక మంది మహిళా సిబ్బంది మా వద్ద ఆవేదన వ్యక్తం చేస్తుంటారు. వీరు స్వేచ్ఛగా పని చేసుకునే పరిస్థితి ఉండాలి.

– డాక్టర్ అగ్గున మేఘన, డిప్యూటీ సివిల్ సర్జన్, ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి, పలాస



కొరత అబద్ధం.. మేత నిజం

ఈ ఫొటో చూడండి. శ్రీకాకుళం మండలంలోని బైరి గ్రామం నుంచి వంశధార నదిలోకి వెళ్లే మార్గమిది. ఇసుక అక్రమ రవాణా జరగకుండా ఉండేందుకు అధికారులు ట్రెంచ్ తవ్వారు. కానీ ఈ ట్రెంచ్‌ను కప్పేసి ఇసుక అక్రమార్కులు యథేచ్ఛగా తమ పనికానిచ్చేస్తున్నారు.





బైరి గ్రామ పరిసరాల్లో అక్రమంగా ఇసుక పోగులేసి విచ్చలవిడిగా విక్రయాలు జరుగుతున్న ప్రదేశాలివి. చెత్త సంపద కేంద్రంతో పాటు మరో 20 ప్రాంతాల్లో ఇసుక అక్రమంగా ఇసుక పోగులేసి ఉన్నాయి. ఈ పోగులను లారీల్లోకి, ట్రాక్టర్‌లోకి లోడింగ్ చేసి తరలించుకుపోతున్నారు. టీడీపీ నాయకుల కనుసన్నల్లో అక్రమ ఇసుక దందా నడుస్తోంది. బైరి చుట్టుపక్కల దాదాపు 300 ట్రాక్టర్ల ఇసుక పోగులు ప్రస్తుతం ఉన్నాయి. దీన్నిబట్టి ఇక్కడెంత ఇసుక దందా నడుస్తుందో చెప్పడానికి ఈ చిత్రమే సాక్ష్యం.

- జిల్లాలో ఇసుక మాయాజాలం
- టీడీపీ నేతల కనుసన్నల్లో అనధికారికంగా ఇసుక విక్రయాలు
- వ్యూహాత్మకంగా వ్యవహరించిన కూటమి ప్రభుత్వం
- ఇసుకను అందుబాటులోకి తీసుకు రాకుండా తాత్సారం చేసిన పాలకులు
- అధికారనేతలకు కాసులు.. వినియోగదారులకు ఇక్కట్లు



శ్రీకాకుళం మండలంలోని బైరి గ్రామ శివారులో ఇసుక అక్రమంగా తరలిపోకుండా ఉండేందుకు గాను తవ్విన ట్రెంచ్ ఇది. అందరి దృష్టిలో అక్కడ ఇసుక రవాణా జరగడానికి ఆస్కారం లేదని బయటికి మెసేజ్ వెళ్లేలా వ్యవహరిస్తున్నారు. కానీ, ఇంకో మార్గంలో ఇసుక యథేచ్ఛగా తరలిపోతోంది.

ఈ చిత్రంలోని టిప్పర్లు చూడండి. ఈ నెల 24వ తేదీన గార-కళింగపట్నం దారిలో బూరవల్లి, బైరి మధ్య శివారు ప్రాంతాల్లో అక్రమంగా వేసిన పోగుల నుంచి జేసీబీతో టిప్పర్ లారీలకు లోడింగ్ చేసి రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్న తరుణంలో స్థానికుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ సిబ్బంది పట్టుకున్నారు. టిప్పర్లతో పాటు లోడింగ్ చేసిన జేసీబీని కూడా పట్టుకుని శ్రీకాకుళం రూరల్ పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. అప్పగించిన రోజున టిప్పర్లలో నిండా ఇసుక ఉంది. తెల్లవారే సరికి ఆ ఇసుక అంతా మాయమై టిప్పర్లు మాత్రమే మిగిలి ఉన్నాయి.





ఇసుకతో ఉన్న టిప్పర్ల లారీలివి. అక్రమంగా తరలిస్తుండగా పట్టుబడ్డాయి. ఆమదాలవలస మండల పరిధిలోకి వచ్చే నాగావళి అవతలి గ్రామాలైన బెలమం, లొద్దలపేట, పొందూరు మండలం సింగూరు పరిధిలోకి వస్తే నదీ పరివాహక ప్రాంతం నుంచి ఇసుక అక్రమంగా తరలించుకుని పోతుండగా పట్టుబడ్డాయి. టీడీపీ నేతల చేస్తున్న ఇసుక దందాకు పట్టుబడిన టిప్పర్ లారీలు నిలువెత్తు సాక్ష్యాలు.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

దోపిడీకి అధికార పార్టీ నాయకులు సరికొత్త మార్గాలు వెతికారు. ఇసుక కృత్రిమ కొరత సృష్టించి తమ్ముళ్లకు లబ్ధి చేకూరేలా వ్యూహాత్మకంగా వ్యవహరించారు. గత ప్రభుత్వంలో స్టాక్ చేసిన ఇసుకను అమ్ముకుని కూటమి సర్కారు సొమ్ము చేసుకోగా, మరోవైపు అనధికార తవ్వకాలు, అక్రమ రవాణాతో పచ్చనేతలకు మేలు జరిగేలా పథకం ప్రకారం అడుగులేసింది. దీని వల్ల ఇసుక మాఫియా ఒకవైపు కోట్లు గడిస్తుండగా, మరోవైపు భవన యజమానులు, కార్మికులు నిలువునా నష్టపోతున్నారు.



నదీ తీరాల్లో..

శ్రీకాకుళం రూరల్ పరిధిలోని వంశధార నది ప్రవహించే బైరి, కరజాడ, బూరవల్లితో పాటు నాగావళి నదికి ఆనుకుని ఉన్న కళ్లేపల్లి, కిల్లిపాలెం, పొన్నాం, బట్టేరు, నైరా శివార్లలో ఇసుక అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఇసుక అక్రమంగా తవ్వకాలు జరిపేసి, చుట్టుపక్కల ప్రాంతాల్లో పోగులేస్తున్నారు. అక్కడి నుంచి విక్రయిస్తున్నారు. రెండు రోజులు తవ్వకాలు జరిపి, ఒకరోజు విరామం ఇచ్చి అక్రమ రవాణా సాగిస్తున్నారు. పోగేసిన ఇసుకను లోడింగ్ చేసేందుకు ఏకంగా జేసీబీలనే వాడుతున్నా రు. ఆమదాలవలస మండలం బెలమం, లొద్దలపేట, కొత్తవలస, నిమ్మ తొర్లాడ గ్రామాల్లో రాత్రి వేళల్లో ఇసుక అక్రమ తవ్వకాలతో పాటు రవాణా చేస్తున్నారు. తెల్లారేసరికి నదీ పరివాహక ప్రాంతాల్లో రవాణా ఆనవాళ్లు కనిపించకుండా జాగ్రత్త పడుతు న్నారు.

పక్కా ప్లాన్ ప్రకారమే..

జిల్లాలో ఇసుక మాయాజాలం నడుస్తోంది. పాలక పక్షాల నాయకులు పథకం ప్రకారం నాగావళి, వంశధార నదుల నుంచి ఇసుక తరలించేస్తున్నారు. దానికి సంబంధిత సిబ్బంది వ్యూహాత్మకంగా సహకరిస్తున్నట్టుగా జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఎక్కడో ఒకచోట టెంట్ వేసి, గస్తీ కాస్తున్నట్టుగా అధికార వర్గాలు హడావుడి చేస్తున్నాయి. నదుల్లోకి వెళ్లే మార్గాల్లో ఒకటి రెండు చోట్ల ట్రెంచ్‌లు తవ్వేసి, వాటి ఫొటోలను పత్రికలను విడుదల చేస్తున్నారు. కానీ జరగాల్సిన ఇసుక దందా ఇంకోవైపు జరిగిపోతోంది. ట్రెంచ్‌లు ఒకవైపు ఉంటే, తవ్వకాలు, రవాణా మరోవైపు జరిగిపోతున్నాయి.

ఇదంతా పచ్చనేతల కనుసన్నల్లోనే జరుగుతోంది. ఒకటి రెండు చోట్ల దాడులు చేస్తున్నా ఎవరూ భయపడుతున్న పరిస్థితి లేదు.

కూటమి సర్కారు ఆట ఇలా..

ఎన్నికలకు ముందు కూటమి నాయకులు ఎన్నో చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇసుకను అమ్ముకుంటోందని, తాము వస్తే ఉచితంగా ఇస్తామని చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఉచితం పక్కన పెడితే గత ప్రభుత్వంలో కన్న ఎక్కువగా ఇసుకను విక్రయిస్తున్న పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వంలో అధికారికంగా సేకరించి ఉన్న ఇసుకను స్టాక్ పాయింట్‌గా పెట్టి ఈ ప్రభుత్వం అమ్ముకుని సొమ్ము చేసుకుంది. అయితే ముందు చెప్పిన విధంగా స్టాక్ పాయింట్లలో ఇసుక లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. కొత్తూరు మండలం అంగూరులో 40వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని మొదట ప్రకటించారు. చివరికి విక్రయాలు పూర్తయ్యేసరికి 25,945మెట్రిక్ టన్నులకు మాత్రమే లెక్కలు చూపించారు. దాదాపు 14వేల మెట్రిక్ టన్నుల ఇసుక తేడా కనిపిస్తోంది.

స్టాక్ పాయింట్లు క్లోజ్

గత ప్రభుత్వం స్టాక్ చేసిన ఇసుకను పాయింట్లుగా ఏర్పాటు చేసి ఈ ప్రభుత్వం విక్రయాలు చేపట్టింది. టెక్కలి స్టాక్ పాయింట్‌లో జూలై 26వ తేదీకే ఇసుక విక్రయాలు పూర్తయిపోయాయి. కొత్తూరు మండలం అంగూరు స్టాక్ పాయింట్‌లోనూ ఇసుక అయిపోయింది. దీంతో ఇసుక కోసం వినియోగదారులు ప్రత్యామ్నాయ మార్గాలు వెతికే పరిస్థితి ఏర్పడింది. లేదంటే నిర్మాణాలు ఆగిపోయే పరిస్థితి. అదే జరిగితే జిల్లాలో లక్షా20వేల మంది భవన నిర్మాణ కార్మికులు ఉపాధిని కోల్పోతారు. రెండే రెండు ఇసుక స్టాక్ పాయింట్లు ఉన్నప్పుడు కూడా భవన నిర్మాణ కార్మికులు సరిపడా ఇసుక దొరక్క ఇబ్బంది పడ్డారు.

వ్యూహాత్మకమా..

నిన్నటి వరకు అధికారిక స్టాక్ పాయింట్‌లలో ఇసుక లేకపోవడంతో పరిస్థితి ఆందోళనకరంగా తయారైంది. కూటమి ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడంతో ఇసుక సమస్య తీవ్రంగా మారింది. అయితే జిల్లాలో జరుగుతున్న ఇసుక అనధికార తవ్వకాలు, అక్రమ రవాణా చూస్తుంటే ఇదంతా వ్యూహాత్మకంగానే చేసినట్టు స్పష్టమవుతోంది. అధికారిక స్టాక్ పాయింట్‌లలో ఇసుక అయిపోతే ఇక మనోళ్లు అనధికారికంగా స్టాక్ చేసి ఇసుకను నచ్చిన ధరకు విక్రయించుకుని దోచుకోవడానికి అవకాశం ఉంటుందని వ్యూహాత్మక నిర్లక్ష్యం చేసినట్టుగా అర్థమవుతోంది.

ట్రాక్టర్, జేసీబీ స్వాధీనం

ఎచ్చెర్ల క్యాంపస్: బొంతలకోడూరు పంచాయతీ రుప్పపేట సమీపంలో సముద్ర తీరంలో ఇసుక దిబ్బల నుంచి ఇసుక తవ్వుతున్న జేసీబీ, తరలింపునకు వినియోగిస్తున్న ట్రాక్టర్లను ఎచ్చెర్ల పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు తరలించి, వాహనాలు సీజ్ చేశారు. అనంతరం అక్రమ ఇసుక తవ్వకం, తరలింపుపై కేసులు పెట్టారు.

రాత్రి వేళల్లో ఇసుక దందా



నదిలో ఉంచిన ఇసుక పోగులు

జలుమూరు: మండలంలో పలు చోట్ల రాత్రి వేళ ఇసుక దందా నడుస్తోంది. పగటిపూట నదిలో పోగులు వేసి రాత్రి వేళలో ఈ వ్యాపారం సాగిస్తున్నారు. జిల్లాలో అధికారిక ఇసుక స్టాక్ పాయింట్లలో నిల్వలు లేకపోవడంతో ఇసుకకు రోజురోజుకూ డిమాండ్ ఏర్పడింది. దీంతో అధిక మొత్తం చెల్లించి ఇసుక కొనుగోలు చేస్తున్నారు. మండల పరిధి నది తీర గ్రామాలైన పర్లాం, రామకృష్ణారం, శ్రీముఖలింగం, దొంపాక రీచ్‌ల నుంచి ఈ రవాణా సాగిస్తున్నట్టు సమాచారం. మూడు కిలోమీటర్ల లోపల అయితే ట్రాక్టర్ ఇసుక మూడు నుంచి ఐదు వేలు కాగా మూడు కిలోమీటర్లు దాటితే ఏకంగా ఎనిమిది నుంచి పది వేల వరకూ అమ్మకాలు సాగిస్తున్నారు. పత్రికలలో కథనాలు వస్తే తాత్కాలికంగా ఆయా మార్గాలలో ట్రెంచ్‌ఏర్పాట్లు చేస్తే మరో వైపు ఎవరికి కనిపించకుండా ఆయా జీడిమామిడి తోటల్లో మార్గాలు ఏర్పాటు చేసి అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు.

రెండు ఇసుక లారీలు సీజ్



సీజ్ చేసిన ఇసుక లారీలు

రణస్థలం: మండలంలోని కొచ్చెర్ల పంచాయతీలో కల్తీ ఇసుకను రవాణా చేస్తున్న రెండు లారీలను జేఆర్ పురం పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఈ నెల 24న 'కల్తీ ఇసుక విక్రయం' శీర్షికన 'సాక్షి'లో వార్త ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో కొచ్చెర్ల పంచాయతీలో గల సుందరపాలెం, లావేరు మండలంలోని రేగపాలెంలో సమీప తోటల్లో అక్రమంగా సముద్ర ఇసుక, గెడ్డ ఇసుక కల్తీ చేసి విక్రయిస్తుండడంపై నిఘా వేశారు. ఆదివారం అర్ధరాత్రి భోగాపురం, రాజాపులోవకు చెందిన రెండు లారీలతో కల్తీ ఇసుకను అక్రమంగా రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. జేఆర్ పురం ఎస్ఐ ఎస్. చిరంజీవి రెండు ఇసుక లారీలను సీజ్ చేసి లారీ యాజమానులు క్లీనర్ మొత్తం నలుగురుపై కేసు నమోదు చేశారు.

కృష్ణం వందే జగద్గురుం



శ్రీకాకుళం నారాయణ తిరుమలలో విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో నృత్యపోటీలు



కృష్ణార్జున మందిరంలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణ పోటీలు

పల్లెలు రేపల్లెలా మారాయి. కాంక్రీటు వనాల్లో బృందావనాలు వికసించాయి. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా వేషధారణలు భేషుగ్గా కుదిరాయి. గోకులాష్టమి నాడు సిక్కోలు అంతటా ఆధ్యాత్మిక శోభ అల్లుకుంది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం



హయాతినగరం రెల్లివీధిలో ఉట్టి కొడుతున్న యువకులు



వజ్రపుకొత్తూరు రూరల్: కృష్ణుడు, గోపిక వేషధారణలు

పార్టీ అండగా అంటుంది..

ధైర్యంగా ఉండండి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్
- టీడీపీ వర్గీయుల దాడిలో చనిపోయిన కూన ప్రసాద్ కుటుంబానికి పరామర్శ

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేట గ్రామంలో టీడీపీ వర్గీయుల దాడిలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త కూన ప్రసాద్ కుటుంబాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌తో కలిసి సోమవారం పరామర్శించారు. తండ్రి కూన వెంకటరావు, ఇతర కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సంఘటనను పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. భవిష్యత్‌లో ఆయన వచ్చే అవకాశం ఉందని, కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుంటామని అన్నారు.

కూటమి ప్రభుత్వం వచ్చాక దాడులు

కూటమి ప్రభుత్వం వచ్చిన కొద్ది రోజుల్లోనే వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయని స్థానిక నాయకులు సత్తారు గోపి, మొదలవలస కృష్ణ, కూన కిరణ్‌కుమార్, సీపాన దిలీప్‌కుమార్ వివరించారు. తమకు ప్రాణహాని ఉందని వీరు కృష్ణదాస్‌కు వివరించారు. గ్రామంలో పికెట్ ఉన్నా తమకు హెచ్చరికలు వస్తున్నాయని వీరు అన్నారు. జిల్లా ఎస్పీ దృష్టికి, ఇతర పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీసుకు వెళతామని అన్నారు.



ధర్మాన కృష్ణదాస్, గొర్లె కిరణ్‌కుమార్‌కు గ్రామ పరిస్థితి వివరిస్తున్న స్థానిక నాయకులు

స్థానిక ఎన్నికల్లో ఏకగ్రీవం లక్ష్యంగా...

స్థానిక ఎన్నికల్లో ఏకగ్రీవాలే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ శ్రేణులపై కూటమి నాయకులు దాడులు చేస్తున్నారని ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఫరీదుపేటలో సోమవారం మీడియాతో మాట్లాడారు. ఈ అంశంపై తాము ఢిల్లీలో ధర్నా సైతం చేసినట్లు చెప్పారు. ప్రజాస్వామ్యంలో దాడులు సరికాదని అన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని మంచి పనులకు ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, నరసన్నపేట, పోలాకి, జలుమూరు ఎంపీపీలు ఆరంగి మురళి, ముద్దాడ బైరాగి నాయుడు, వాన గోపి, వైఎస్సార్ సీపీ నాయకులు రాజాపు అప్పన్న, కోరాడ చంద్రభూషణగుప్త, స్థానిక సర్పంచ్ కొత్తకోట పూర్ణచంద్రరావు, సనపల నారాయణ రావు, ముద్దాడ శంకరరావు, బెండు రామారావు, మాడుగుల మురళీధర్‌బాబా, బొడ్డేపల్లి సుధాకర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

హిందీ ఎల్పీ సెట్ నోటిఫికేషన్ విడుదల చేయాలి


మాట్లాడుతున్న విశ్రాంత డీఈఓ బి.మల్లేశ్వరరావు, పక్కనే చంద్రమోహన్, సురంగి, కోనే

శ్రీకాకుళం న్యూకాలనీ: హిందీ ఎల్పీసెట్ (భాషా పండిత ప్రవేశ పరీక్ష) నోటిఫికేషన్ విడుదల చేసి, హిందీ పండిత శిక్షణ కళాశాలల్లో ప్రవేశాలు నిర్వహించాలని హిందీ మంచ్ జిల్లాశాఖ అధ్యక్షుడు దొంతం పార్వతీశం, ప్రధాన కార్యదర్శి కనుగుల సత్యం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శ్రీకాకుళం నగరంలోని శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో సోమవారం హిందీ మంచ్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఆ సంఘ జిల్లాశాఖ అధ్యక్షుడు దొంతం పార్వతీశం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో విశ్రాంత డీఈఓ బలివాడ మల్లేశ్వరరావు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి హైస్కూల్ ప్లస్ (జూనియర్ కాలేజీ)ల స్థాయి వరకు అన్ని పాఠశాలల్లో మిగతా సబ్జెక్టులతో సమానంగా హిందీ పండిట్ పోస్టులు మంజూరు చేయాలన్నారు. విశ్రాంత జిల్లా అధికారి సురంగి మోహనరావు మాట్లాడుతూ, డీఎస్సీలో ఎక్కువ సంఖ్యలో హిందీ పండిట్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు.

'కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలను ఖండిస్తున్నాం'

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలో ఆదివారం జిల్లా కబడ్డీ సంఘం శ్రీకాకుళం పేరిట ఏర్పడిన నూతన కార్యవర్గ ఎన్నికలను ఖండిస్తున్నామని శ్రీకాకుళం జిల్లా కబడ్డీ అసోసియేషన్(286/2014) ప్రధాన కార్యదర్శి అక్కేని చిరంజీవిరావు తెలిపారు. జిల్లాలో గత 40 ఏళ్లుగా కబడ్డీ క్రీడను ప్రోత్సహిస్తూ క్రీడాకారుల ఎదుగుదలకు పాటుపడుతున్న కబడ్డీ సంఘాన్ని కాదని నూతనంగా మరో సంఘాన్ని ఏర్పాటు చేయడం సరికాదన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష భర్త, వ్యాపారవేత్త యార్లగడ్డ వెంకన్న చౌదరి అధ్యక్షునిగా, తాను కొనసాగుతున్నట్టు పేర్కొన్నారు. కొందరు స్వార్థ పరులు పదవులపై మోజుతో కొత్తకొత్త పేర్లతో క్రీడాసంఘాలను ఏర్పాటుచేసి భ్రష్టు పట్టిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఉత్సాహంగా తైక్వాండో ఎంపిక పోటీలు


ఎంపికైన క్రీడాకారిణులతో తైక్వాండో శ్రీను, లక్ష్మణ్, నవీన్, కోచ్‌లు

శ్రీకాకుళం న్యూకాలనీ: స్థానిక టౌన్‌హాల్ వేదికగా సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి తైక్వాండో ఎంపిక పోటీలు ఆద్యంతం ఉత్సాహంగా సాగాయి. ఏపీ తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తైక్వాండో శ్రీను మాట్లాడుతూ ఈ నెల 31, సెప్టెంబర్ ఒకటో తేదీల్లో తిరుపతి వేదికగా వేర్వేరు రాష్ట్ర స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపికలను ఇక్కడ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఎంపికైన జిల్లా క్రీడాబృందాలకు కోచ్‌లుగా మజ్జి గౌతమ్, మోర్తా సాయి బాలాజీలు వ్యవహరిస్తున్నారు. కార్యక్రమంలో తైక్వాండో నవీన్, శాప్ కోచ్ లక్ష్మణరావు, జోగిపాటి వంశీ, ఎస్.శేఖర్, హరి, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉర్లాంలో పిచ్చికుక్క స్వైర విహారం


గాయాలను చూపుతున్న మహిళలు

నరసన్నపేట: ఉర్లాంలో పిచ్చి కుక్క సోమవారం మధ్యాహ్నం స్వైర విహారం చేసింది. కుక్క దాడిలో దీర్ఘాశి చిట్టెమ్మ, కె.పుణ్యవతి, కె.మహేష్, డొప్పల లక్ష్మి, భారతమ్మలకు గాయాలయ్యాయి. పీహెచ్‌సీలో వీరికి ప్రథమ చికిత్స చేసి నరసన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించామని వైద్యాధికారి గొలివి సుజాత తెలిపారు. గాయాలు తీవ్రంగా ఉన్నాయని తెలిపారు.

కఠిన చట్టాలతోనే దాడులకు అడ్డుకట్ట



కోల్‌కతా అత్యాచార ఘటన దారుణం. చట్టాలు బలహీనంగా ఉండటంతోనే వైద్యులపై తరచూ దాడులు జరుగుతున్నాయి. ఆస్పత్రుల్లో రోగుల వెంట వచ్చే బంధువులను కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. మద్యం సేవించి ఆస్పత్రులకు వచ్చే వారిని కూడా కట్టడి చేయాలి.

– కె.కుమారి, స్టాఫ్‌నర్స్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, హిరమండలం

ప్రత్యేక భద్రత చర్యలు ఉండాలి



ఆస్పత్రుల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక భద్రతా చర్యలు ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా మహిళా సిబ్బంది భద్రత విషయంలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలి. రాత్రి వేళల్లో విధులు నిర్వర్తించే సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి.

– స్వర్ణలత, స్టాఫ్‌నర్స్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, టెక్కలి



ప్రతి వార్డు వద్ద సెక్యూరిటీ ఉండాలి



వైద్యులపైన జరుగుతున్న దాడులు చాలా అమానుషం. రాత్రి సమయంలో డ్యూటీలో ఉండే డాక్టర్‌కు, స్టాఫ్‌కు కూడా రక్షణ ఉండాలి. అలాగే ప్రతి వార్డు, ఓపీ వద్ద సెక్యూరిటీ పెంచే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఇదే కాకుండా ప్రజలకు కూడా సామాజిక బాధ్యత కలిగి ఉండాలి.

– డాక్టర్ ఈఎస్ సంపత్‌కుమార్, రిటైర్డ్ ప్రభుత్వ వైద్యులు

అంగరంగ వైభవంగా గోకులాష్టమి


జాలరి పాటకు సుదీర్ఘ ప్రదర్శన


ఆకట్టుకున్న వేషధారణ

కాశీబుగ్గ/పలాస: పలాస యాదవ సేవా సమితి ఆధ్వర్యంలో పలాస వేదికగా నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంబరాన్నంటాయి. పలాస రైల్వే మైదానంలో జరిగిన కార్యక్రమం లొడగల కామేశ్వరరావు అధ్యక్షతన భగవద్గీత పారాయణం, గొల్ల చదువు గానం, తప్పెటగుళ్లు, జాలరి పాట ప్రదర్శన, కోలాటం, భరతనాట్యం, జానపదాలు, పల్లెపదాలు నృత్యాలు, సంగిడీ రాళ్ల పోటీలు అందరినీ అలరించాయి. మధ్యాహ్న సమయంలో మామిడి తాతారావు ఆధ్వర్యంలో సుమారు ఆరు వేల మందికి కృష్ణ ప్రసాదం ఏర్పాటు చేశారు. చివరిగా సాయంత్రం ఐదు గంటలకు నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమంతో వేడుకలు ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ నర్తు రామారావు యాదవ్, మాజీ మంత్రి గౌతుశ్యామ సుందర శివాజీలను సత్కరించారు. కార్యక్రమంలో యార్లగడ్డ వెంకన్న చౌదరి, వజ్జ బాబూరావు, దాసరి తాతారావు, అంబటి కృష్ణమూర్తి, వంకల కూర్మారావు, సప్ప నవీన్, డొక్కరి శంకర్, దడియాల నరసింహులు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ నర్తు రామారావుకు సన్మానం చేస్తున్న యాదవ కుల పెద్దలు


అలరించిన రేగులపాడు తప్పెటగుళ్ల నృత్య ప్రదర్శన

ఎఫ్ఏ పోయి ఎస్ఏ వచ్చె!

- నేటి నుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పరీక్షలు
- గతంలో ఫార్మేటివ్ అసెస్‌మెంట్‌లో రోజుకు రెండు పరీక్షల నిర్వహణ
- ఇకపై రోజుకో పరీక్ష చొప్పున నిర్వహణ
- ప్రభుత్వ వైఖరిని తప్పు పడుతున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

హిరమండలం, శ్రీకాకుళం న్యూ కాలనీ: ప్రభుత్వం మారడంతోనే విద్యార్థుల పరీక్ష విధానాలు కూడా మారిపోతున్నాయి. ఇదివరకు ఫార్మెటివ్ అసెస్‌మెంట్ పేరిట నిర్వహించిన యూనిట్ పరీక్షలను నేటి నుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్ పేరిట నిర్వహించనున్నారు. గతంలో ఈ పరీక్షలను 3 రోజులు నిర్వహించే వారు. తాజాగా పరీక్షల షెడ్యూల్ ప్రకారం ఆరురోజులు పరీక్ష నిర్వహిస్తారు. ప్రైవేటు మినహా అన్ని అనుబంధ పాఠశాలలకు జిల్లా ఉమ్మడి పరీక్షలకు నిర్వహణ సంస్థ ద్వారా పరీక్ష



పేపర్లను సరఫరా చేసేలా అధికారులు చర్యలు చేపట్టారు.

20 మార్కులకు పరీక్ష

ఇంతవరకు యూనిట్ పరీక్షల స్థానంలో నిర్వహించే ఫార్మెటివ్ పరీక్షలు 20 మార్కులకు మాత్రమే ఉండటంతో ఉదయం, మధ్యాహ్నం కలిపి రెండేసి పరీక్షల చొప్పున నిర్వహించి మూడు రోజుల్లో పూర్తి చేసేవారు. తాజా మార్గదర్శకాల ప్రకారం ఆరు రోజుల పాటు నిర్వహించనున్నారు. దీనివల్ల సిలబస్‌పై ప్రభావం చూపుతుదని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి. నెలవారీ సిలబస్‌లో 3 రోజులు కుదించాల్సి ఉంటుందని చెబుతున్నారు.

టోఫెల్‌కు మంగళం

ఈ నెల 27 నుంచి వచ్చే నెల 2 వరకు ప్రాథమిక తరగతులకు ఉదయం 10.45 నుంచి 11.45 వరకు పరీక్ష నిర్వహిస్తారు. ఉన్నత తరగతులకు మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 గంటల వరకు నిర్వహించనున్నారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి జూలై వరకు టోఫెల్ తరగతులు నిర్వహించారు. అయితే జూలై 15న పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన 2024–25 అకడమిక్ క్యాలెండర్‌లో టోఫెల్ తరగతుల నిర్వహణపై ఎలాంటి పీరియడ్స్ కేటాయించకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంత వరకు అమలవుతున్న టోఫెల్ తరగతులకు కూటమి ప్రభుత్వం మంగళం పాడినట్లైంది.

విధానాలు మారాలి..



సెల్ఫ్ అసెసెంట్‌మెంట్ పేరిట నిర్వహించే యూనిట్ టెస్టులకు ఎందుకు ఇంత హడావుడి చేస్తున్నారో తెలియడం లేదు. గంటసేపు జరిగే పరీక్షకు రోజంతా సమయం వృథా చేయడం సరికాదు. ప్రభుత్వాలు, అధికారులు మారినప్పుడల్లా విధాన పరమైన నిర్ణయాలను ఏకపక్షంగా మార్చేస్తున్నారు. కనీసం ఉపాధ్యాయులతో చర్చించడంలేదు. దీనివల్ల ఎవరికీ ప్రయోజనం ఒనగూరదు.

– ఎండ ఉమాశంకర్, యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్

పనిదినాలు వృథా



సెల్ఫ్ అసెస్‌మెంట్ విధానంతో పాఠశాలల్లో విలువైన పనిదినాలు వృథా అవుతాయి తప్పిస్తే.. వాటి వల్ల ఎలాంటి ఉపయుక్తం లేదు. గతంలో మూడు రోజుల్లో పరీక్షలు పూర్తయ్యేవి. రోజుకు ఒక గంటపాటు నిర్వహించే పరీక్షలతో విద్యార్థుల కాలాన్ని వృధా చేయడమే కాకుండా, పాఠశాల పని దినాలు కూడా నిరుపయోగమవుతాయి.

– పేడాడ కృష్ణారావు, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలి..



ఎస్‌సీఈఆర్టీ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పరీక్షలు ఈనెల 27 నుంచి మొదలవుతాయి. గతంలో మాదిరిగా కాకుండా రోజుకు ఒక పరీక్ష చొప్పున ఉంటాయి. డీసీఈబీ నుంచి ప్రశ్న పత్రాలను సిద్ధం చేయించాం. ఈ పరీక్షలకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలను అన్ని యాజమాన్య పాఠశాలలు విధిగా పాటించి అమలు చేయాలి.

– డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, డీఈఓ శ్రీకాకుళం

'పార్టీ తరఫున అండగా ఉంటాం'


ఆమదాలవలస: వంజంగిలో రాజశేఖర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ స్పీకర్ తమ్మినేని


పొందూరు: మృతుడు ప్రశాంత్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: అచ్యుతాపురం సెజ్‌లో ఇటీవల చోటు చేసుకున్న ప్రమాద ఘటన బాధిత కుటుంబాల్లో అంతులేని విషాదాన్ని నింపిందని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. బాధిత కుటుంబాలను సోమవారం తమ్మినేని పరామర్శించారు. ఆమదాలవలస మండలం వంజంగి గ్రామానికి చెందిన పైడి రాజశేఖర్ కుటుంబాన్ని ఆయన పలకరించి మృతుని తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. ఆయా కంపెనీల నిర్వహణ విషయంలో భద్రతాపరమైన చర్యలను పర్యవేక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అధికంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్న పరిశ్రమలను గుర్తించి వాటిలో భద్రతా లోపాలను గుర్తించాలని, ఇందుకు ప్రభుత్వం ముందుకు రావాలని ఆయన కోరారు. ఇప్పటికే తమ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంఘటన జరిగిన తీరుపై ఆరా తీశారన్నారు. ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్నప్పుడు పార్టీలకు అతీతంగా ఆయా కుటుంబాలకు వెన్నుదన్నుగా నిలవాలని తమ్మినేని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బొడ్డేపల్లి నారాయణరావు, జెడ్పీటీసీ బెండి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

పొందూరులో..

పొందూరు: ఇటీవల అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన ప్రమాదంలో చనిపోయిన హంస ప్రశాంత్ కుటుంబాన్ని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం సోమవారం పరామర్శించారు. మృతుని తల్లి, భార్య, కుటుంబాన్ని ఓదార్చారు. కుటుంబానికి పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు గాడు నాగరాజు, కిల్లాన సూర్యారావు, బాడాన సునీల్, వండాన సూరప్పునాయుడు, పప్పల రాధాకృష్ణ, అనకాపల్లి గోవింద, సత్తిబాబు, రమణమ్మ, అనకాపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ అధికారుల కేసు దర్యాప్తు వేగవంతం

శ్రీకాకుళం క్రైమ్ :

జీఎస్టీ అధికారులమని చెప్పి ముగ్గురు మీడియా ప్రతినిధులు స్వీట్ల వ్యాపారిని బెదిరించి రూ. 2 లక్షలు తీసుకుని మోసగించడమే కాకుండా కులం పేరుతో దూషించిన కేసులో పోలీసుల దర్యాప్తు వేగవంతమైంది. ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ఆదేశాలతో రెండో పట్టణ పోలీసులే కాక జీఎస్టీ అధికారులు సైతం ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో జిల్లాకేంద్రంలో ప్రస్తుతం ఈ కేసు హాట్ టాపిక్‌గా మారింది. దళిత వ్యక్తిని బెదిరించిన నేపథ్యంలో ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నమోదు కావడంతో ఈ కేసును కాశీబుగ్గ డీఎస్పీ పాత్రుని శ్రీనివాసరావుకు దర్యాప్తు బాధ్యతలు ఎస్పీ అప్పగించారు. శ్రీకాకుళం నూతన డీఎస్పీ ఇంకా బాధ్యతలు స్వీకరించకపోవడంతో కాశీబుగ్గ డీఎస్పీకి కేసు అప్పగించారు.

మీడియా అనే గౌరవంతో..

మీడియా అనే గౌరవంతో ఫిర్యాదు అందిన నాలుగు రోజులైనా కేసు నమోదు చేయకుండా తీసుకున్న డబ్బులు బాధితునికి ఇచ్చేయమని పోలీసులు ఆ ముగ్గురికీ చెప్పారు. రాజీ చేసేందుకు ప్రయత్నించగా విమర్శలు వ్యక్తమయ్యాయి. చివరికి బాధితుడు ఎస్పీని ఆశ్రయిస్తాననడంతో కేసు నమోదు చేశారు. కేసు నమోదైన రోజే విషయం జిల్లా జీఎస్టీ అధికారిణి రాణీ మోహన్ దృష్టికి వెళ్లడంతో శాఖాపరంగా విచారణ జరిపించారు. వ్యాపారి రాయపు రెడ్డి చంద్రశేఖర్‌ని పిలిపించి అతను చెప్పిన వివరాలను నివేదిక రూపంలో జీఎస్టీ కమిషనర్‌కు అందించినట్లు సమాచారం.

మద్యం తాగవద్దు అన్నందుకు..

- యువకుడి ఆత్మహత్యాయత్నం
- వంశధార కాలువలో మునిగి గల్లంతు
- గాలిస్తున్న పోలీసులు


గల్లంతైన దుర్గాప్రసాద్ (ఫైల్)

హిరమండలం: చిన్నప్పుడే తండ్రి చనిపోతే.. అన్నీ తానే అయి అమ్మ పెంచి పెద్ద చేసింది. ఆలనపాలన చూసుకుని బిడ్డల బాధ్యతను భుజానికెత్తుకుంది. కానీ ఆ తల్లి మద్యం తాగవద్దు అని అన్నందుకు కుమారుడు ఏకంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వంశధారలో మునగడంతో ఇప్పటివరకు ఆచూకీ తెలియలేదు. దీంతో ఆ తల్లి పేగు తల్లడిల్లిపోతోంది. హిరమండలం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హిరమండలం మైత్రి కాలనీలో జోగి సావిత్రి తన ఇద్దరు కుమారులతో కలిసి నివాసముంటోంది. పిల్లలు చిన్నగా ఉన్నప్పుడే భర్త చనిపోయారు. పెద్ద కుమారుడు జోగి దుర్గాప్రసాద్ మద్యానికి బానిసయ్యాడు. ప్రతి


సంఘటన స్థలంలో స్థానికులతో మాట్లాడుతున్న సీఐ, ఎస్ఐలు

రోజూ తాగి ఇంటికి వస్తుండడంతో మంచి పద్ధతి కాదు నాయనా అని చెప్పింది. అయినా ఇటీవల మద్యం తాగుతుండడంతో సోమవారం గట్టిగానే మందలించింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన దుర్గాప్రసాద్ వంశధార కుడి కాలువలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కాలువలో దూకిన తర్వాత అతని ఆచూకీ తెలియరాలేదు. కొత్తూరు సీఐ చింతాడ ప్రసాద్, స్థానిక ఎస్ఐ జి.నారాయణ స్వామి హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్లను తెప్పించి వెతికే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఘటనతో హిరమండలంలో విషాదం నెలకొంది.

ద్విచక్రవాహనాలు ఢీ.. ఇద్దరికి గాయాలు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని డేఅండ్ నైట్ సమీప నాగావళి కొత్త వంతెనపై ఎదురెదురుగా వస్తున్న ద్విచక్రవాహనాలు ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ట్రాఫిక్ ఎస్ఐ వరదరాజులు తెలిపిన వివరాల మేరకు.. రణస్థలం మండలం దేరసాం గ్రామానికి చెందిన కడగళ్ల నారన్నాయుడు తన మేనకోడలు బొంతు యశోద ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటీలో చదువుతుండటంతో క్యాంపస్‌కెళ్లి అనుమతిపై బయటకు తీసుకొచ్చారు. రాజమండ్రిలో ఉన్న తన బావగారింటికి యశోదను చేర్చేందుకు శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్సులో బస్ ఎక్కించేందుకు బయల్దేరారు. కొత్త బ్రిడ్జికి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టి తక్షణమే పరారయ్యాడు. రోడ్డుపై పడి ఉన్న ఇద్దరినీ మనోహర్ అనే వ్యక్తి 108 ద్వారా మెడికవర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. నారన్నాయుడుకు కాలు ఫ్రాక్చర్ కావడంతో పాటు చేతి వేళ్లకు తీవ్రగాయాలు కాగా, యశోదకు కంటి కింద, కుడి కాలికి గాయాలయ్యాయి. దీనిపై సీసీటీవీ ఫుటేజీలో ప్రమాద దృశ్యాలు పరిశీలిస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

టెక్కలి రూరల్: బొప్పాయిపురం పంచాయతీ పరిధి చల్లపేట గ్రామానికి చెందిన మల్లేష్ అనే వ్యక్తి సోమవారం మధ్యాహ్నం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇది గుర్తించిన కుటుంబ సభ్యులు అపస్మారక స్థితిలో ఉన్న మల్లేషును హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అయితే కుటుంబంలో వచ్చిన చిన్నపాటి తగాదా కారణంగానే ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు.

సంతలో జూదం

ఎచ్చెర్ల: లావేరు మండలం బుడుమూరు సంతలో డొక్కు ఆట ఆడుతున్న చీపురుపల్లి మండలం నిమ్మలవలస గ్రామానికి చెందిన పలువురిని సోమవారం పోలీసులు పట్టుకున్నారు. పోలీస్ స్పెషల్ టీమ్ ఎస్ఐ ఎ.కోటీశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.7,050 నగదు, రెండు మోటారు సైకిళ్లు, టీవీఎస్ ఎక్సెల్, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. లావేరు ఎస్ఐ లక్ష్మణరావు కేసు నమోదు చేశారు.

ప్రకృతి గీసిన చిత్రం



టెక్కలి రూరల్: నందిగాం మండల కేంద్రంలో పచ్చటి పొలాల మధ్య దృశ్యాలు కనువిందు చేస్తున్నాయి. పంట పొలాల మధ్యలో ఒకేఒక కొబ్బరి చెట్టు వెనుక కొండలు ఎంతో ఆహ్లాదంగా కనిపిస్తున్నాయి.

విద్యా వ్యవస్థలో సంస్కరణలు అవసరం

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రంలో ప్రాథమిక స్థాయి నుంచి పీజీ వరకు మారుతున్న పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యారంగంలో సంస్కరణలు జరగాల్సిన అవసరం ఉందని ఏపీ ఇంటలెక్చువల్స్ ఫోరం(ఏపీఐఎఫ్) జోనల్ అధ్యక్షులు సురంగి మోహనరావు తెలిపారు. ఏపీఐఎఫ్ జిల్లా యూనిట్ తొలి కార్యవర్గ సమావేశం సోమవారం స్థానిక శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా సురంగి మాట్లాడుతూ నాణ్యమైన, విలువలతో కూడిన విద్యని అందించడం ద్వారా బాధ్యతాయుతమైన పౌరులను తయారు చేయగలమని అన్నారు. విశ్రాంత డీఈఓ బలివాడ మల్లేశ్వరరావు మాట్లాడుతూ, ప్రాథమిక విద్యను బలోపేతం చేసి, మాతృభాష తెలుగు, జాతీయ భాష హిందీ, ఆంగ్ల భాషలకు సమాన ప్రాధాన్యతను ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడే విద్యను అందించడం అవసరమన్నారు. విద్యా వ్యవస్థలో తీసుకురావాల్సిన సంస్కరణలపై అఖిల భారతీయ తూర్పు కాపు సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, డాక్టర్ ముట్నూరు ఉపేంద్రశర్మ, పూడి జనార్దనరావు, పాట్నూరు వెంకట్రావు, తెరవీ


గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఏపీఐఎఫ్ ప్రతినిధులు, అధికారులు

కార్యదర్శి ఆర్‌వీ రమణమూర్తి తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా పిసిని చంద్రమోహన్‌ను అతిథులు, అధికారులు సత్కరించారు. అంతకుముందు కళాశాల ప్రాంగణంలో ఉన్న జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి పాట్నూరు వెంకటరావు, సభ్యులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, కోనే శ్రీధర్, ఎంవీ మల్లేశ్వరరావు, బస్వా జగన్నాథరావు, సురేష్, మణికంఠ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.